

లోపలి పేజీల్లో
రహదారులపై మృత్యుఘోష 6
● అవగాహన కార్యక్రమాలకే పరిమితం
● ఏడాదిలో రోడ్డు ప్రమాదాల్లో 184 మంది మృత్యువాత
సై.. సై.. సైకిల్ సవారీ.. 7
● ఆరోగ్యంతోపాటు ఆనందం ● లాభాలపై అవగాహన
కల్పిస్తున్న రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు



మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి ఇన్‌ఫ్లో

దిగువకు కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి మిడ్‌మానేరు నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నాలుగు వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా, మిడ్ మానేరు నుంచి మూడు వేల క్యూసెక్కుల నీరు డ్యాంలోకి వచ్చి చేరుతోంది. ఎల్‌ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.307 టీఎంసీల నీరు ఉంది. మంగళవారం వరకు వెయ్యి క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి రాగా బుధవారం మూడు వేల క్యూసెక్కులకు పెంచారు.

ఊపందుకున్న వరినాట్లు..

ఇల్లందకుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో యాసంగి వరినాట్లు ఊపందుకున్నాయి. ఎస్సారెస్పీ నీళ్ల రావడంతో పొలాలు దున్నుకుని నాట్లు వేస్తున్నారు. స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతో రైతులు నాట్లు వేయిస్తున్నారు. మండలంలో పూర్తి సాగు విస్తీర్ణం 19,200 ఎకరాలు ఉండగా అందులో పత్తి సాగు 9,600, వరి 7,200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మిగతా మూడు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తారు.



విజిబుల్ పోలీసింగ్ ప్రాధాన్యాన్ని పెంచాలి

సీపీ అభిషేక్ మొహంతి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ వ్యాప్తంగా విజిబుల్ పోలీస్ ప్రాధాన్యాన్ని పెంచాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలులో అన్ని విభాగాల అధికారులు, ఎస్‌హెచ్‌వోలతో నేరసమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నైట్ పెట్రోలింగ్ విధులను మెరుగుపరిచామన్నారు. పోలీసుస్టేషన్ పరిధిలోని ఫిర్యాదులు ఎక్కువగా అందే ప్రాంతాలపై దృష్టి పెంచాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను గమనించాలన్నారు. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారితో పాటు, ప్ర జలను మోసం చేసే వారిపై షీట్లను తెరవాలన్నారు.

గంజాయి పట్టుకున్న సందర్భాల్లో నిందితుడికి శిక్ష పడేవిధంగా టీజీ నాబ్ వారు జారీ చేసిన నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఒకే చోట పలు ప్రమాదాలు జరిగిన చోటును హాట్ స్పాట్‌గా గుర్తించి, వాటికీ గల కారణా లను తెలుసుకుని అవసరమైతే ఇతర శాఖల సమన్వయంతో సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాష్, ప్రొబేషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి, అడిషనల్ డీసీపీ లక్ష్మినారాయణ, డిప్యూటీ డైరెక్టర్ ఫర్ ప్రాసిక్యూషన్ శరత్, ఏసీపీలు వెంకటస్వామి, శ్రీనివాస్, నరేందర్, శ్రీనివాస్ జి, విజయ్ కుమార్, వేణుగోపాల్, కాశయ్య, మాధవి పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు విద్యార్థులకు సూచించారు. బుధవారం దుర్శేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు పాఠశాలలో కాన్షియస్నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో కరీంనగర్ రూరల్ సీఐ అశోక్‌కు మార్, ఎస్సై విజయ భాస్కర్, ఐసిపి ఎస్ పర్వీన్, 1098 కోఆర్డినేటర్ సంపత్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది కుమార్, కమలొద్దీన్, అశోక్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో సంస్థాగత సందడి

● సంక్రాంతికి జిల్లా కమిటీ
● 10 వరకు మండల కమిటీల ప్రకటన
● 2.20 లక్షల సభ్యత్వంతో రాష్ట్రంలో ముందంజ



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించిన బీజేపీ సంక్రాంతికి జిల్లా కమిటీని ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నది. మరో రెండు, మూడు రోజుల్లో మిగిలిపోయిన బూత్ కమిటీలకు, జిల్లాలోని అన్ని మండల కమిటీలకు అధ్యక్షులను, కార్యవర్గాలను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. మండల కమిటీలకు అధ్యక్షులను ఎంపిక చేసేందుకు జిల్లా సీనియర్ నేతలతో త్రిసభ్య కమిటీని నియమించారు. జిల్లాలో బీజేపీ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఐదు జోన్లుగా విభజించింది. ఒక్కో జోన్‌కు ఒక్కో అధ్యక్షుడితోపాటు కార్యవర్గాలను నియమిస్తారు.

ఒకటి, రెండు రోజుల్లో బూత్ కమిటీల ఏర్పాటు

జిల్లావ్యాప్తంగా పార్టీ గుర్తించిన 28 మండలాలకు ఒకటి రెండు రోజుల్లో అధ్యక్షులను, కార్యవర్గాలను ప్రకటించనున్నారు. జిల్లావ్యాప్తంగా 2.2 లక్షల మందిని పార్టీలో సభ్యులుగా చేర్చుకున్నారు. జిల్లా పరిధిలో గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ సాధించిన ఓట్లలో సగం మేరకు సభ్యత్వాలు సేకరించాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నది. జిల్లాలో ఆ లక్ష్యాన్ని అధిగమించి సభ్యత్వ నమోదు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలుస్తున్నది.

ఇప్పటికే 1,800 మందిని క్రియాశీల సభ్యులుగా చేర్పించారు. వివిధ మండలాల నుంచి సుమారు మరో 200 సభ్యత్వాలు రానున్నాయని, మొత్తంగా రెండు వేల మంది క్రియాశీల సభ్యులుగా ఉంటారని పార్టీ నాయకత్వం చెబుతున్నది.

జిల్లాలోని 28 పార్టీ మండలాల్లో 1,338 బూత్‌లు ఉన్నాయి. ఈ బూత్ కమిటీల్లో సభ్యత్వ నమోదు పూర్తిచేసి 50 శాతం కమిటీలను నియమిస్తేనే ఆ బూత్‌లు ఉన్న పరిధిలోని మండల కమిటీని వేస్తారు. జిల్లాలో అన్ని మండలాలు ఆ అర్హతను సాధించాయి. కొన్ని బూత్‌లలో సాంకేతిక కారణాలతో కమిటీలను వేయలేకపోయామని, ఒకటి రెండు రోజుల్లో అన్ని కమిటీలు పూర్తవుతాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 15లోగా జిల్లా కమిటీని ప్రకటించనున్న నేపథ్యంలో మండల కమిటీల అధ్యక్షులను 10వ తేదీలోగా ప్రకటించాల్సి ఉంది.

పదవుల కోసం పోటాపోటీ

జిల్లాలో పార్టీ పదవులు పొందే విషయంలో నేతల్లో పోటాపోటీ నెలకొన్నది. ఒక్కో మండలానికి ఐదు నుంచి పదిమంది అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. ఆశావహులు తమ అనుచరులతో కలిసివచ్చి పార్టీ పెద్దల పై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ స్థానిక నాయకులు, క్రియాశీల కార్యకర్తలతో చర్చించి మండల అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తే బాగుంటుందో సూచించేం దుకు త్రిసభ్య కమిటీని వేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల ఆంజనేయులు,సీనియర్ నాయకులు కన్నెబోయిన ఓదెలు ఈ త్రి సభ్య కమిటీలో ఉన్నారు. ఈ కమిటీ కరీంనగర్ పార్లమెంట్ నియోజ కవర్గ పరిధిలోని మండలాలన్నింటిలో పర్యటించి నాయకులు, కార్య కర్తల అభిప్రాయాలు సేకరించి అధ్యక్ష పదవికి పేర్లను సూచిస్తారు. ఒకటి రెండు రోజుల్లో ఈ కమిటీ తమ నివేదికను సమర్పిస్తుందని, 10వ తేదీకల్లా మండల కమిటీల నిర్మాణం పూర్తవుతుందని నాయకత్వం చెబుతున్నది. రెండు విడతలుగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న సీనియర్ నాయకుడు, న్యాయవాది గంగాడి కృష్ణారెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా కొనసాగించే అవకాశాలున్నట్లు తెలిసింది.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటే ప్రయత్నం..

బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసుకొని రెట్టించిన ఉత్సాహంతో

మిగతా 8వ పేజీలో...

ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

కలెక్టర్ పమేలా సత్పతి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని బస్‌స్టేషన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సరైన సమయంలో రక్తం లభించక మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. డిప్యూటి రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, కరీంనగర్-2 డిపో మేనేజర్ మల్లయ్యతో పాటు 138 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ అజయ్ యాదవ్, డిప్యూటి ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పి పురుషోత్తం, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు విజయమాధురి, వి మల్లయ్య, బస్‌స్టేషన్ కస్టమర్ రిలేషన్ మేనేజర్ జి సురేష్ పాల్గొన్నారు.

నగర అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే గంగుల కమలాకర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌ను అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం నగరంలోని 12, 16వ డివిజన్లలో ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిలిపివేసిన సీఎం అస్యూరెన్స్ నిధులను విడుదల చేసి మధ్యలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. రాజకీయంగా కక్ష సాధించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై కేసు నమోదు చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో మేయర్ వై సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు తోట రాములు, బోనాల శ్రీకాంత్, నాంపల్లి శ్రీనివాస్, దిండిగాల మహేష్, కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

నలుగురు విద్యార్థినులకు అస్వస్థత



కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

తిమ్మాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ ఇంటిగ్రేటెడ్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో బుధవారం సాయంత్రం ఫుడ్ పాయిజన్ కావడంతో నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 60 మంది విద్యార్థినులు ఉంటూ సమీపంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకుంటున్నారు. బుధవారం ఉదయం కిచిడి, పచ్చిపులుసు అల్పాహారంగా తిని పాఠశాలకు వెళ్లారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలోనూ కిచిడి, పచ్చిపులుసు పెట్టారు. సాయంత్రం పాఠశాల నుంచి హాస్టల్‌కు వచ్చిన విద్యార్థినుల్లో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. ఎం అరణ్య, పి నందిని, జి కళ్యాణిని కరీంనగర్‌లోని ప్రభుత్వ అసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సిరివల్లి ఇంటికి వెళ్లింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

అందుబాటులో ఉండని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు

ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌లో ముగ్గురు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురయినప్పుడు ఒక్కరూ విధుల్లో లేరు. వాచ్‌ఉమెన్‌గా విధులు నిర్వర్తించే శిరీష విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం అందించిన తరువాత హాస్టల్‌కు చేరుకొని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై వార్డెన్ రేవను వివరణ కోరగా బుధవారం అందరికీ వీక్లీఆఫ్ కావడం వల్ల రాలేదని తెలిపారు. తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎల్‌ఎండీ ఎస్సై వివేక్ హాస్టల్‌కు చేరుకుని విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఏబీవీపీ నాయకుల ఆందోళన.. అరెస్టు

కరీంనగర్ క్రైం (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు జిల్లా ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఐ సృజన్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆందోళన విరమించాలని చెప్పినా వినకపోవడంతో ఐదుగురు ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అలరించిన కళాకారుల ప్రదర్శనలు



పురస్కారాలు అందుకున్న కళాకారులతో కలెక్టర్ పమేలా సత్పతి, మేయర్ సునీల్‌రావు, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా కళాభారతిలో నిర్వహించిన కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, అకాడమీ అధ్యక్షుడు గుండ్ర కృపాదానం నేతృత్వంలో జరిగిన వేడుకల్లో 2024 సంవత్సరానికి గాను సుమారు 30 మందికి విభాగాల వారీగా గ్రామీణ కళాజ్యోతి, జీవిత సాఫల్య, యువ, బాల పురస్కారాలు అందజేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో సల్వాజి ప్రవీ ణ్, కె రమణయ్య, వి గోపాల్‌రావు, వంగ సుధాకర్, అలివేలి సమ్మిరెడ్డి, జ్ఞానప్రకాశ్ పాల్గొన్నారు.

జానపద కళలను ప్రోత్సహించాలి: కలెక్టర్ పమేలా సత్పతి

జానపద కళలను అందరూ ప్రోత్సహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. వేడుకలకు అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జానపద కళలను వీక్షించేలా చూడాలన్నారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ మిద్దె రాములు వంటి కళాకారులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచేది కళాకారులేనన్నారు.



కళాభారతిలో నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

పురస్కారాలు అందుకున్న కళాకారులు

కందాల రాజేందర్, తెల్లోజు సత్యనారాయణ, అల్లిపురం సాంబయ్య, కుసుమ రాజ్‌కుమార్, సుకనపల్లి సమ్మయ్య, మాదం సమ్మయ్య, బొంగోని శంకరయ్య, బెజ్జంకి మొగిలయ్య, కూడికల దామోదర్, కంచరి ప్రభాకర్, తాటికొండ బ్రహ్మయ్య, సూత్రాల మొండయ్య, కొన్ని సమ్మిరెడ్డి, గోపు సంకీర్తన, వైరాగ్యం ప్రభాకర్, రొడ్డ యాదగిరి, అంకారపు సునిత, తొగరు సాల్మన్ రాజు, గద్దె ఉదయ్‌కుమార్, జూలూరి నాగరాజు, వాడపల్లి చక్రపాణి, వనపర్తి రాజేంద్రప్రసాద్, వి మంజునాథ్, సంకేపల్లి నాగేంద్రశర్మ, పిల్లిట్ల ప్రకాశ్, గడ్డం పరశురాములు, రుద్రోజు సహస్రలక్ష్మి, కిట్ల చరణ్, మల్లం బాలయ్య.

వృద్ధుడి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గాలేక కాలనీలోని రాజీవ్‌నగర్ తండాకు చెందిన లవుడ్య దేవయ్య(65) మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దేవయ్య భార్య శాంతమ్మ రెండేళ్ల క్రితం మర ణించగా, పెద్దకుమారుడు రాజేష్ వద్ద ఉంటున్నాడు. భార్య మరణం తర్వాత మద్యానికి బానిసై మానసిక స్థితిని కోల్పో యాడు. మంగళవారం రాత్రి అందరూ పడుకున్నాక ఇంటి ఆవర ణలో ఉరివేసుకున్నాడు. బుధవారం తెల్లవారు జామును కుటుంబ సభ్యు లు గమనించేసరికి మృతిచెంది ఉన్నాడు. మృతుడికి ముగ్గురు కు మారులు. పెద్దకుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● హైదరాబాద్‌లో ఎల్లారెడ్డిపేట యువకుడు..


సిరిగాధ మనోహర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం తాత అనారోగ్యంతో మరణించడంతో తట్టుకోలేని మనువడు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సిరిగాధ మనోహర్(25) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో నివాసముంటారు. మనోహర్‌కు ఎల్లారెడ్డిపేటలో ఉండే తాత రామచంద్రంతో మంచి అనుబంధం ఉండేది. రామచంద్రం రెండు నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. తాత మరణం తట్టుకోలేక మనోహర్ మానసికంగా కుంగిపోయాడు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో తల్లిదండ్రులతో కలిసి ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి తన గదిలో నిద్రకు ఉపక్రమించాడు. తాత లేని జీవితం ఎందుకని మనస్తాపం చెందిన మనోహర్ గదిలో ఉరివేసుకుని మృతి చెందాడు. బుధవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేటకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్సారెస్పీ కాలువలో మహిళ మృతదేహం


దూలం సరోజన (ఫైల్)

హుజూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మం డలం పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో ఓ మహిళ మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం ఎస్సారెస్పీ కాలువలో మహిళ మృతదేహం కొట్టుకు వస్తుండగా గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందిం చారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పోలీస్, అగ్నిమాపక సిబ్బంది ఒడ్డుకు చేర్చారు. మృతురాలి వివరాలు ఆరా తీయగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన దూలం సరోజన (68)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

పెగడపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయించిన అనక సురేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు మల్యాల సీఐ నీలం రవి తెలిపారు. పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 5న కిలో గంజాయితో నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఇంద్రవెల్లి మండలం బొప్పాపూర్ గ్రామానికి అనక సురేష్ వద్ద నుంచి కొనుగోలు చేసినట్లుగా తెలిపారు. ఈ మేరకు పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్ ఆధ్వర్యంలో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో సీఐతో పాటు పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా...
12మంది మహిళలకు తీవ్ర గాయాలు

హుజూరాబాద్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని ధర్మరాజుపల్లి స్టేజీ వద్ద బుధవారం ఉదయం ట్రాలీ ఆటో బోల్తా పడి 12 మంది మహిళలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ కూలీ పనులు వెళ్లేందుకు మహిళలు ఆటోలో ఎక్కగా, ధర్మరాజుపల్లి స్టేజీ వద్ద ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న 12మందికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కలిసే ఉంటాం..
విభజించొద్దు..

● కలెక్టర్ కార్యాలయం ఎదుట బతికెపల్లి ప్రజల నిరసన

● పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజలు

జగిత్యాల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా కలిసి ఉంటున్నామని, ఇప్పుడు కూడా తామంతా కలిసే ఉంటామని, తమను గ్రామం నుంచి వేరు చేయవద్దని బతికెపెల్లికి చెందిన గ్రామస్థులు తమ ఆవేదనను నిరసన రూపంలో తెలుపుతూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పెగడపల్లి మండలం బతికెగ్రామంలో మొత్తం 14 వార్డులు ఉన్నాయి. ఓ కులానికి చెందిన తామంతా ఉంటున్న రెండు వార్డులను కలిపి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తామన్న విషయంపై ఆ రెండు వార్డులైన కొండయ్యపల్లి, పుల్లయ్యపల్లి వార్డులకు చెందిన ప్రజలు, యువకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొని మహిళలు, గ్రామస్థులు ధర్నా చేపట్టారు. ఆ వార్డులకు చెందిన యువకులు వాటర్ ట్యాంక్ ఎక్కి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా బతికెపల్లి గ్రామంగా ఉంటున్న తమను ఆ గ్రామం నుంచి కేవలం తమకు చెందిన వార్డులను విభజించడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కేవలం స్వార్థరాజకీయాల కోసమే ఇలాంటి గందరగోళానికి తెరలేపారని విమర్శించారు. తమ గ్రామాన్ని విభజించ వద్దని ప్రజాప్రతినిధులకు విన్నవించినా, ప్రజావాణిలో వినతిపత్రం అందించిన ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఓ ప్రజాప్రతినిధి అండతోనే తమకు అనుకూలంగా ఉండే వారిని ఓ గ్రామంగా, లేరని భావించే వారిని మరో గ్రామంగా విభజించి, రాజకీయంగా లబ్ధిపొందేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన తెలుపుతున్న గ్రామస్థులను, వాటర్ ట్యాంకు ఎక్కిన యువకులను పోలీసులు సముదాయించి ఆందోళన విరమింపజేశారు. రూరల్ సీఐ కృష్ణారెడ్డి, టౌన్ ఎస్సై కిరణ్‌కుమార్‌తో పాటు పోలీసుల జోక్యంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ నిరసనలో కొండయ్యపల్లి, పుల్లయ్యపల్లి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులు

● నాడు తల్లి..నేడు తండ్రి మృతి


తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు

మానకొండూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో చిన్నారులు అనాథలయ్యారు. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన బండారి రేణుక-వెంకటేశ్ దంపతులకు కుమార్తె వర్షిణి, కుమారుడు సాయిచరణ్‌లు జన్మించారు. వెంకటేశ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండేళ్ల క్రితం రేణుక అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి వెంకటేశ్ ఇద్దరు పిల్లలను సాకుతున్నారు. కొన్ని రోజుల క్రితం వెంకటేశ్ అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం పలు ఆసుపత్రులలో వైద్యం చేయించినా నయం కాలేదు. బుధవారం రాత్రి వెంకటేశ్ మృతి చెందాడు. దీంతో ఇద్దరు చిన్నారులు తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. వర్షిణి కరీంనగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుకుంటుండగా, సాయి చరణ్ మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు.

కొత్తపల్లి శివాలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు


కొత్తపల్లి శివాలయంలోపూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

భగత్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం కొత్తపల్లి పట్టణంలోని పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లిలో ఒకరి జన్మదినోత్సవానికి హాజరైన కవిత శివాలయా నికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● రహదారులపై డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు ఏవి?

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించడానికి ఏర్పాటు చేసిన 'బ్రీత్ ఎనలైజర్'లను కూడా పోలీసులు ప్రధాన రహదారులపై వినియోగించకుండా నగరాలు, పట్టణాల్లో మాత్రమే ఉపయోగిస్తూ విమర్శల పాలవుతున్నారు. రాజీవ్‌రహదారి, ఇతర ప్రధాన రోడ్లపై మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లు ప్రమాదాలు చేసి ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్నారు. ఇసుక, గ్రానైట్ ఓవర్ లోడ్‌లపై ఆర్టీఏ అధికారులు, పోలీసులు పట్టించుకోక పోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. జిల్లాలో తరచుగా జరుగుతున్న 82 ప్రమాద స్థలాలను అధికారులు గుర్తించి 68 చోట్ల నియంత్రణ చర్యలు తీసుకున్నట్లుగా ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా



2023లో జరిగిన రోడ్డు ప్రమాదాలు జరగగా 203 మంది మృత్యువాత పడ్డారు. మరో 600పైగా గాయపడ్డారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 184 మంది మృత్యువాత పడ్డారు. మరో 600 వరకు గాయపడ్డారు.

● అవగాహన కార్యక్రమాలకే పరిమితం

● ఏడాదిలో రోడ్డు ప్రమాదాల్లో 184 మంది మృత్యువాత

● మద్యం మత్తులో డ్రైవింగ్‌తోనే అధిక ప్రమాదాలు

● ఓవర్‌లోడ్‌పై చర్యలు కరువు

రహదారులపై మృత్యుఘోష

● బర్నింగ్ ఇష్యూ



కరీంనగర్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కీలకమైన రాజీవ్‌రహదారితోపాటు పలు రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. వాహనదారుల నిర్లక్ష్యానికి అమాయకులు బలవుతున్నారు. రాజీవ్ రహదారితో పాటు రోడ్లపై దాబాలు, హోటళ్లలో అక్ర మంగా మద్యం సిట్టింగ్‌లు నడుస్తున్నాయి.



అన్ని గ్రామాల్లో రేషన్ షాపులకు రెట్టింపుగా బెల్ట్‌షాపులు, దాబాలు నడుస్తున్నాయి. ఈ హోటళ్లు, దాబాల్లో వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్లనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గత సంఘటనల్లో పోలీసుల విచారణ సందర్భంగా స్పష్టమైంది. మద్యం బెల్ట్‌షాపులు, దాబాల్లో మద్యం సిట్టింగ్‌లపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఎలాంటి నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. ప్రధాన రహదారులపై ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన హైవే గస్తీ బృందం జాడే లేదు. గతంలో హైవే పోలీసు పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేసిన తరువాత ఎత్తేసింది. ప్రమాదాలు తగ్గించడానికి జనవరి 31 వరకు జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని రోడ్ల పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

ప్రమాదాల వివరాలు

సంవత్సరం	మృతులు	క్షతగాత్రులు
2023	203	600
2024	184	600

రోడ్డు ప్రమాదాలపై సమీక్షలు జరుపుతూ, నివారణకు చర్యలు తీసుకోవాలంటూ ప్రతి ఏటా జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాలు సందర్భంగా పోలీసు, ఆర్టీఏ, ఆర్అండ్‌బీ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు ఆనవాయితీగా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ప్రమాదాల నివారణకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని ప్రధాన రహదారులు, రోడ్లపై 82 డేంజర్ జోన్‌లను అధికారులు గుర్తించారు. ఈ డేంజర్ జోన్‌లలో తరచూ ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం..

కంచి వేణు, రవాణాశాఖాధికారి, హుజూరాబాద్..



ఆర్టీఏ కార్యాలయానికి లైసెన్స్ కోసం వచ్చే ప్రతి ఒక్కరికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగిస్తున్నాం. ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ సక్రమంగా ఉందా లేదా అనేది చూసుకోవాలి. ఈ నెలరోజుల పాటు ఆటో, ఆర్టీసీ అన్ని వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం. ఏకగ్రాతతో వాహనాలను నడిపితతే ప్రమాదాలను తగ్గించొచ్చు. వాహనాలకు లైసెన్స్‌లు, ఇతర పత్రాలుంటేనే రహదారిపై అనుమతిస్తాం.

● ప్రమాదకరంగా రాజీవన్ రహదారి

నాలుగు వరుసలతో స్టేట్ హైవే-1గా రాజీవ్ రహదారి నిర్మించినప్పటికీ మూల మలుపులు సరిచేయక పోవడంతోపాటు గ్రామాల వద్ద ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు, పూర్తిగా చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా తయారయింది. గ్రామాల వద్ద సర్వీస్ రోడ్ల స్థానంలో గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. రాజీవ్‌రహదారితో జిల్లాకు రవాణా సౌకార్యలు మెరుగవుతా



యని ఆశించిన ప్రజలకు ప్రమాదాలు పెరగడంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. వాహనాల ఓవర్‌స్పీడ్, డ్రంకెన్ డ్రైవ్‌లతో రాజీవ్ రహదారి పొడుగునా నిత్యం ఏదో ఒక చోట ప్రమాద సంఘటన జరుగుతూ అమాయకులు మృత్యువాత పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని బెజ్జంకి మండలం రేగులపల్లి నుంచి గోదావరిఖని వరకు రోడ్డును ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు, రోడ్డు దాటేందుకు ప్రత్యేకంగా ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జిలు నిర్మించకుండా కేవలం చిన్న దారితో గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు దాటుతున్న సందర్భాల్లో తరచుగా పాదచారులు, వాహనదారులు ప్రమాదాలబారినపడి చనిపోతున్నారు.

● ఇష్టారాజ్యంగా ఓవర్‌లోడ్....

కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని ఇసుక క్వారీలు, గ్రానైట్ క్వారీల నుంచి ఓవర్‌లోడ్‌తో ఇసుక, గ్రానైట్ హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో లారీలు నడుస్తున్నాయి. దీంతో రహదారిపై వాహనాల రాకపోలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి.




హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రదార రహదారిపై తరుచూ ప్రమాదాలు జరిగే స్థలం

డేంజర్ జోన్..

● తరచూ ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు శూన్యం

హుజూరాబాద్‌రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అతివేగం... నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. హుజూరాబాద్ పట్టణం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-163 కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై వారంలో కచ్చితంగా మూడు, నాలుగు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. హుజూరాబాద్ పట్టణం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిపై, జమ్మికుంట, పర్కాల్ వెళ్లే ప్రధాన రహదారిపై అత్యంత ప్రమాదకర ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణంలోని కేసీ క్యాంపు శివారులోని పర్కాల్ క్రాస్ రోడ్డు వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటుగా, తుమ్మనపల్లి, సింగాపూర్, లింగాపూర్ క్రాస్, కొత్తగట్టు క్రాస్‌ల వద్ద ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. జమ్మికుంట ప్రధాన రహదారిపై చెల్పూర్, రంగాపూర్, శాలపల్లి-ఇందిరానగర్ గ్రామాల్లోని క్రాసింగ్ వద్ద వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఓ వైపు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తుండగానే వరుసగా ప్రమాదాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

● చెట్టును ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి..

హుజూరాబాద్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం మాందాడిపల్లి గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారు జామున ఓ లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వీర్లపాడు మండలానికి చెందిన గుజ్జుల శివారెడ్డి (48) ఏపీ39యూ4969 అనే లారీలో పొగాకు లోడు చేసుకొని ఎన్టీఆర్ జిల్లా కంచకర్ల నుంచి గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్‌కు వెళ్లడానికి మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు క్లీనర్ బాబులుతో బయలుదేరాడు. కొద్ది దూరం వచ్చిన తర్వాత డ్రైవర్ శివారెడ్డి పక్కన కూర్చుని క్లీనర్ బాబులుతో డ్రైవింగ్ చేయించాడు. హుజూరాబాద్ మండలం మాందాడిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో శివారెడ్డి లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ నడుపుతున్న షేక్ బాబులుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో అతడిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివారెడ్డి సోదరుడు గుజ్జుల వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

● కుక్క అడ్డం రావడంతో ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కుక్క అడ్డం రావ డంతో ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండ లంలోని మంగపేట శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన ఆటో డ్రైవర్ చొక్కారపు శ్రీనివాస్(62) తన ఆటో నంబరు టీఎస్ 22టీ7240 లో బుధవారం జమ్మికుంట నుంచి పెద్దపల్లికి ఇద్దరు ప్రయాణికులతో వెళ్తుండగా మంగపేట శివారులో రోడ్డుపై హఠాత్తుగా కుక్క అడ్డం రావడంతో ఆటో బోల్తాపడింది. డ్రైవర్ చొక్కారపు శ్రీనివాస్ తల, కాళ్లు, చేతు లకు తీవ్రగాయాలు కావడంతో 108లో కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న రాజమల్లు, భాగ్యలక్ష్మికి గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మాందాడిపల్లిలో చెట్టును ఢీ కొట్టిన లారీ, గుజ్జుల శివారెడ్డి (ఫైల్)

● ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు ..

తంగళ్లపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి మండెపల్లి గ్రామానికి చెందిన సూరకాని మణితేజ (23) అనే యువకుడ మృతిచెందాడు. బుధవారం మండెపల్లి నుంచి మణితేజ ద్విచక్రవాహనంపై తంగళ్లపల్లికి వస్తుండగా ఓ ఫంక్షన్‌హాల్ ఎదుట గల మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి స్థంభానికి ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య రాధిక, రెండేళ్ల కుమారుడు రిషివర్ధన్ ఉన్నారు. ఈ సంఘటనలపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● టిప్పర్‌ను ఢీ కొని..


బాదావత్‌రాజు మృతదేహం

మేడిపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీ కొని ఓ ద్విచక్రవాహన దారుడు బుధవారం మృతి చెందాడు. పసునూర్ గ్రామానికి చెందిన బాదావత్ రాజు(29) మం గళవారం రాత్రి తన మిత్రుడిని కలవడానికి హైదరాబాద్‌కు వెళ్లేందుకు తన ద్విచక్ర వాహనంపై పసునూర్ నుంచి జగిత్యాలకు బయలు దేరాడు. కొండాపూర్ గ్రామ శివారులో గల వైష్ణవి సూపర్ మార్కెటు వద్ద ట్రాఫిక్ నిబంధనల పాటించకుండా నిలిపి ఉంచిన టిప్పర్‌ను రాజు తన ద్విచక్ర వాహనంతో వెనుక వైపు నుంచి ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. రాజు భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మెరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

సత్వరమే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ. ఎం. రమేష్‌బాబు



గణేశ్‌నగర్,జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముఖ అయిన రైతులకు యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. రమేష్‌బాబు తెలిపారు. బుధవారం జిల్లా సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది 1204 సర్వీసులను మంజూరు చేశామని తెలిపారు. ఒక డిసెంబర్ నెల లోనే దాదాపు160 సర్వీసుల మంజూరు చేశామని తెలిపారు. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే దాదాపు 30 శాతం పెరిగిందని అన్నారు. వ్యవసాయ సర్వీసుల మంజూరు ఆన్‌లైన్ చేయ డంతో వేగంగా పనులు అవుతున్నా యన్నారు. అలాగే ఈ- స్టోర్స్ విధానం ప్రవేశ పెట్టడం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకొని కావాల్సిన సమయంలో తీసుకుని పనులు ప్రారంభించవచ్చు న్నారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలంబాటు కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు.

సై..సై.. సైకిల్ సవారీ..



మానేరు డ్యాంపై సైక్లిస్టులు

- ఆరోగ్యంతోపాటు ఆనందం
- లాభాలపై అవగాహన కల్పిస్తున్న రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సైకిల్ అంటే క్రేజ్ ఉండేది.. కాలేజీ కుర్రవాడి నుంచి ఉద్యోగి వరకు సైకిల్ ఉపయోగించేవారు. కాలం మారింది.. సైకిల్ స్థానాన్ని కార్లు, బైకులు ఆక్రమించాయి. సైక్లింగ్ ఒక మంచి వ్యాయామంగా ఉపయోగపడుతుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సైకిల్‌పై అవగాహన కల్పించేందుకు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు. ఉరుకుల పరుగుల జీవితంలో శరీరానికి అలసట లేకుండా పోయి ఒత్తిడితో కూడిన జీవనం సాగిస్తున్నారు నగరవాసులు. అలాంటి అలవాట్లను మార్చే ఉద్దేశంతో ప్రజల ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగించేందుకు వారంలో కనీసం నాలుగు రోజులైనా వాకింగ్, జాగింగ్, రన్నింగ్, సైక్లింగ్‌తో శరీరాన్ని కదిపితే లెక్కకు మించిన ప్రయోజనాలు పొందుతారని సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు తెలుపుతున్నారు. సైక్లింగ్ వల్ల ఊపిరితిత్తులు కూడా బాగా పనిచేస్తాయి. శారీరక, మానసిక ఆరోగ్యానికి సైక్లింగ్ ఉపయోగపడుతుంది. సైక్లింగ్ సంఘ సభ్యులు సైకిల్‌పై వందల కిలోమీటర్ల ప్రయాణిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ అసోసియేషన్ 2009లో ప్రారంభమైంది. ఐదుగురు సభ్యులతో ప్రారంభమైన అసోసియేషన్‌లో ప్రస్తుతం వంద మంది సభ్యులు ఉన్నారు.

సమాజహిత కార్యక్రమాలు....

జిల్లా పాలన యంత్రాంగం సహకారంతో మారథాన్ మొదటి ఎడిషన్ నిర్వహించారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం నుంచి రెండో ఎడిషన్ నిర్వహించారు. మహిళా దినోత్సవం నాడు 5కే రన్‌ను నిర్వహించారు. ఇందులో వెయ్యి మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిసెంబరు 16 విజయ్ దివస్‌ను పురస్కరించుకొని సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ వరకు 150 కిలోమీటర్ల సైకిల్ రైడ్‌ను నిర్వహించారు.



సైక్లింగ్ నిత్య జీవితంలో భాగమైంది...

- ఉడుతల పద్మావతి, డీడీ మార్కెటింగ్

సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించాం. నిత్య జీవితంలో సైక్లింగ్ ఒక భాగమైంది. కొన్ని సంవత్సరాలుగా ఉదయంపూట సైక్లింగ్ చేస్తున్నాను. సైక్లింగ్ మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది .



హెల్దీ కరీంనగర్‌గా మారుస్తాం..

- పసుల మహేష్, రన్నర్స్ సైక్లిస్ట్ సంఘ అధ్యక్షుడు

కరీంనగర్‌ను హెల్దీ కరీంనగర్.. వెల్దీ కరీంనగర్‌గా మార్చాలన్నది రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ ముఖ్య లక్ష్యం. సైక్లింగ్‌తో ఆరోగ్యం మానసిక ప్రశాంతత లభిస్తుంది.



గుండెకు మంచి వ్యాయామం

- డాక్టర్ అజయ్ ఖండల్

రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్‌లో సభ్యుడు కావడం నా అదృష్టం. గుండెకు అవసరమైన వ్యాయామం సైక్లింగ్‌తో లభిస్తుంది. నిత్య సైక్లింగ్‌తో పొట్ట తగ్గి ఆరోగ్యంగా ఉంటారు. సైక్లింగ్‌తో అన్ని రుగ్మతలు దూరమవుతాయి.



సైక్లింగ్ నిత్య జీవితంలో భాగమైంది...

- చల్మెడ వెంకటేశ్వర్‌రావు, సంఘ సభ్యుడు

ప్రతిరోజు కొన్ని కిలోమీటర్లు దూరం సైకిల్ తొక్కే వారిలో శారీరక పటుత్వం శక్తి పెంపొందుతాయి. దీంతో నిత్యం రెట్టింపు శక్తి సామర్థ్యాలతో పనిచేయగలుగుతారు. కాళ్ల కండరాలు గట్టిపడతాయి. సైక్లింగ్ చేస్తున్న ఫలితంగా బరువు తగ్గుతున్న.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

- కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి

కరీంనగర్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతు న్నందున వాటి కట్టడికి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని సవరన్ స్ట్రీట్‌లోగల మహిళా జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు వారి నేరం చేసే విధానం మార్చు తూ ప్రజలను మోసం చేస్తూ ఖాతాల్లో ఉండే డబ్బును చోరీ చేస్తున్నారని, బాధితుల్లో ఎక్కువ మంది అవగాహన లేక వ్యక్తిగత సమాచారం అందించి మోసపోయిన వారే ఉన్నారని అన్నారు. సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్‌లాంటి సాధనతో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సందేశాలు పంపించినట్లయితే వాటికి స్పందించవద్దన్నారు. మీ స్నేహితుల పేరుతో ఫొటోస్ పెట్టి డబ్బులు అడిగితే వెంటనే స్పందించకూడదని, నిర్ధారించు కున్న తర్వాతే రెస్పాండ్ కావాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 లేదా, సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ నిర్మల, ఇన్‌స్పెక్టర్ సునీల్, సబ్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి..

- విద్యా శాఖ రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణ



గర్రెపల్లిలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విద్యా శాఖ రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణ

సుల్తానాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యా శాఖ రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి పలు సూచనలు అందజేశారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని, ఉపాధ్యాయులు ఇందుకు ముందుండాలన్నారు. వంద శాతం ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ కోఆర్డినేటర్‌ను సస్పెండ్ చేయాలి

సుభాష్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీవో)ను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. జిల్లా కేంద్రంలోని శర్మనగర్‌లో గల జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. కాంట్రాక్టరు నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయలేదని ఆరోపించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆర్‌సీవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మహా శివరాత్రి జాతరకు భారీ ఏర్పాట్లు

ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి జాతర

- పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కలెక్టర్, ఎస్పీతో కలిసి రివ్యూ మీటింగ్



రివ్యూ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలగకుండా మహాశివరాత్రి జాతరను నిర్వహించాలని, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తో కలిసి మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మూడు రోజులు పాటు జరిగే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించాలని, నిర్దేశించిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గతం కంటే ఎక్కువగా వేములవా డకు 30 శాతం బస్సులను అధికంగా నడపాలని, భక్తుల రద్దీ ఆధారంగా డిపో మేనేజర్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన రూట్‌లో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు.

- అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాలను పరిష్కరించుకుని పకడ్బందీగా మహాశివరాత్రి జాతర నిర్వహించేందుకు ముందుకు సాగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయం, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండు, ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరను పురష్కరించుకుని రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మహాశివరాత్రి జాతర ప్రత్యేక కార్యక్రమాల వివరాలు..

మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు భీమాశంకర్ శర్మ వివరించారు. ఫిబ్రవరి 25న రాత్రి 7 గంటలకు ప్రభుత్వం, రాత్రి 7.30 గంటలకు తిరుమల, తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 26 తెల్లవారు జామున 12 గంటల నుంచి 2.30 గంటల వరకు స్థానికులను సర్వదర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 3.40 నుంచి 4.30 గంటల వరకు సుప్రభాత సేవ, ఆలయ శుద్ధి, ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ ఉంటుందన్నారు. మహాశివరాత్రి ఫిబ్రవరి 26వ తేదిన సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు శివదీక్ష స్వాముల దర్శనం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు మహాలింగార్చన, రాత్రి 11.35 గంటలకు లింగోద్భావకాలం నందు శ్రీస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఈవో వినోద్‌రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజేపీఎస్‌ను సందర్శించిన పలువురు అధికారులు

గణేశ్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను బుధవారం పలువురు అధికారులు సందర్శించారు. ప్రభుత్వ వైద్యుల బృందం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు వసతి గృహంలోనే ఉండి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు పర్యవేక్షించారు. అస్వస్థతకు గురైన వారిలో అత్యధికులు తమ తల్లిదండ్రులతో ఇళ్లకు వెళ్లిపోగా, మిగతా వారిని వసతిగృహంలోనే విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, వారి బంధువులు తరలివచ్చారు. విద్యార్థులకు అనారోగ్య సెలవులు తీసుకుని, తమ వెంట తీసుకెళ్లడం కనిపించింది. జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకునేందుకు సంబంధిత అధికారులు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎంజేపీఎస్‌కు తరలివచ్చారు. విద్యార్థుల క్షేమ సమాచారం తెల్సుకునేందుకు ఎంజేపీఎస్ ప్రాంతీయ సమన్వయాధికారికి పలుమార్లు ఫోన్ చేసినా, స్పందించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాగుపై రైతులకు అవగాహన సదస్సు



బహుమతులు అందిస్తున్న శాస్త్రవేత్తలు

భగత్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వ ర్యంలో కొత్తపల్లి మండలంలోని నాగుల మ ల్యాల దత్తత గ్రామంలో శాస్త్రవేత్తల బృందం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, పశువైద్య సిబ్బ ంది పంట అవశేషాలను కాల్చకుండా దుక్కిలో దున్నే పద్ధతి, పెరటి తోట పెంపకం, వరిలో సమగ్ర పోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వరి పంటలో వచ్చే చీడపీడల నివారణ, పశువైద్యం, పంట సాగు విధా నాలపై వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి మంజులత, శాస్త్రవేత్తలు డాక్టర్ జి ఉషారాణి, డాక్టర్ మధూకర్‌రావు, రాజేంద్రప్రసాద్, నాగేందర్‌సింగ్, మండల వ్యవసాయాధికారి కృష్ణ, కోరమండల్ సిబ్బంది వారి ఉత్పదకాల గురించి వివరించారు. సంక్రాంతి సందర్భంగా మహిళా రైతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

- ఆధ్వానంగా రాయికల్ మార్కెట్ యార్డు
- పాలకవర్గం లేక కరువైన పర్యవేక్షణ

అసంపూర్తి పనులు.. అవస్థల పాలు



అసంపూర్తిగా మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రహరీ గోడ



అసంపూర్తిగా ఉన్న బెడ్ నిర్మాణాలు

రాయికల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలు అందించి పంటల ఉత్పత్తుల కొనుగోలుకు ఏర్పాటు చేసిన రాయికల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పాలకవర్గం లేక పర్యవేక్షణ కరువై బిల్లులు రాక పనులు సాగడం లేదు. ధర్మపురి వ్యవసాయ మార్కెట్‌కు ఉప కేంద్రంగా ఉన్న రాయికల్ మార్కెట్‌ను ప్రత్యేక మార్కెట్ యార్డుగా 2016లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2017లో తొలి పాలకవర్గం ఏర్పాటైంది. గత ఏడాది పూర్వ కమిటీలను రద్దు చేశారు. మళ్లీ నూతన కమిటీలను ఏర్పాటు చేయలేదు. రాయికల్ మార్కెట్ కమిటీ సుమారు ఆరు ఎకరాల్లో కొనసాగుతోంది. అందులో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, గిడ్డంగులను నిర్మించారు. రెండేళ్ల కిందట మార్కెట్ యార్డులో రూ.1.80 కోట్లతో ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, రూ.20 లక్షలతో మట్టి పనులు పూర్తయినప్పటికీ ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా పూర్తి చేయలేదు. బిల్లులు రాక గుత్తేదారులు పనులు నిలిపి వేసినట్లు తెలిసింది. యార్డులో పనులు పూర్తి కాకపోవడంతో వసతులు కరువయ్యాయి.

ఆరుబయటే కొనుగోళ్లు

రాయికల్ మార్కెట్ యార్డులో వసతులు లేక యేటా వరిధాన్యం, మక్కలు తదితర పంటలను మార్కెట్ పక్కనే ఉన్న స్థలంలో కొనుగోలు చేస్తున్నారు. వర్షాలు కురిస్తే పంటలు తడిచి కొట్టుకుపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మార్కెట్ యార్డుకు ఆదాయం ఉన్నా వసతులు లేకపోవడంతో మండల రైతులు అవస్థలు పడుతున్నారు. రాయికల్ మార్కెట్ కమిటీకి పాలకవర్గం ఏర్పాటు చేయడంతో పాటు నిధులు మంజూరు చేసి వసతులు కల్పించాల్సి ఉంది.

అన్ని పంటలను కొనుగోలు చేయాలి..

ఎనుగంటి నాగరాజు, రైతు, రామాజీపేట

మార్కెట్ యార్డులో అన్ని పంటలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. వరి, మొక్కజొన్నతో పాటు కందులు, పల్లి, నువ్వులు, ఇతర పంటలను రైతులు మార్కెట్‌లో విక్రయించలేక దళారులకు అమ్ముకుంటున్నారు. మార్కెట్ యార్డులో వసతులు కల్పించాలి.



ప్రత్యేక నిధులు కేటాయించాలి..

ఉదయశ్రీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

మార్కెట్ యార్డులో పనులు పూర్తి కాక రైతులకు అవస్థలు తప్పడం లేదు. రూ.1.80 కోట్లతో చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలి. మార్కెట్ యార్డు ఆక్రమణకు గురి కాకుండా అన్ని వైపులా ప్రహరీ నిర్మించాలి. యార్డులో బెడ్ల నిర్మాణం ద్వారా పంటలకు రక్షణ ఉంటుంది.



పరిశోధనలు అభివృద్ధికి తోడ్పడాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

గణేశ్‌నగర్,జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు పరిశోధనా కేంద్రాలుగా మారా లని, పరిశోధనలు అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. యూపీఐ చెల్లింపుల్లో భారతదేశం అగ్రగామిగా ఉందని యూపీఐ ఆలోచన ఒక చిన్న పరిశోధనా పత్రం ద్వారా పుట్టినదే అని అన్నారు. పరిశోధన ద్వారా కనుగొన్న అంశాలు వ్యాపార వాణిజ్య సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ అటనామస్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆర్థిక సహకారంతో, ఆచార్య కల్వకుంట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో మరిన్ని సెమినార్లు నిర్వహిస్తామని అన్నారు. సదస్సు నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎం మలారెడ్డి మాట్లాడుతూ రెండు రోజులు జరిగిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా సుమారు 146 మంది ఔత్సాహిక పరిశోధకులు రిజిస్ట్రేషన్ చేసుకుని పత్రసమర్పణ చేశారన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన శాత వాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ మాట్లాడుతూ విద్యా ర్థులందరూ పరిశోధనల పట్ల ఆసక్తి కనబరచాలని సూచించారు. ఎల్ఐసి సీనియర్ మేనేజర్ ఎస్వి ప్రసాద్‌రావు మాట్లాడారు. కాంపెల్లి అభిరామ్, డా. కంచు తిరుపతి, డా.ఆర్ కిరణ్ కుమార్, డా.ఆర్.వెల్ విజిలను ఉత్తమ పరిశోధనా పత్ర సమర్పకులుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ పి.నితిన్, టి.రాజయ్య, వివిధ కళాశాలల పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి

న్యూస్‌బాక్స్

● కరీంనగర్ అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గంలో మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజొద్దీన్, ఎండీ షబ్బీర్‌లు కోరారు. ఈ మేరకు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో షాదీఖానా, కమిటీహాళ్ల నిర్మాణం చేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలను పునర్నిర్మించాలని కోరారు.

● కరీంనగర్ కల్చరల్ : జిల్లాకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి కిష్టయ్య కళారత్న జాతీయ అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం మేయర్ సునీల్‌రావుతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ స్వరూపారాణి, డీఈ, సినీ నటుడు రొడ్డ యాదగిరి అభినందించారు.

●కరీంనగర్ కల్చరల్: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్‌లో సర్వోదయ సంగీత నిలయం తొలి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. సంస్థ నిర్వాహకుడు విజయ్‌కుమార్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

● కరీంనగర్ టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంలను బుధవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ పరిశీలించారు.

● కరీంనగర్ క్రైం: అనారోగ్యంతో గత ఆగస్టు నెలలో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ హబీబుద్దీన్ కుటుంబానికి భద్రత ద్వారా మంజూరైన 7.60 లక్షల చెక్కును అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ అందజేశారు.

● భగత్‌నగర్: పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తున్నదని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

● కరీంనగర్ కల్చరల్: ఈ మాసంలో 13వ తేదీన భోగి వేడుక, 14న ఉత్తరాయణ పుణ్య కాలం సందర్భంగా మకర సంక్రాంతి పండుగ, 15వ తేదీన కనుమ పండుగ జరుపుకోవాలని నగర వైదిక పురోహితులలో ఒకరైన మంగళంపల్లి శ్రీనివాసశర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

మల్టీపర్పస్ పార్కు పనులు పరిశీలించిన సుడా చైర్మన్

కరీంనగర్ అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీలో భాగంగా చేపట్టిన మల్టీపర్పస్ పార్కు పనులను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కార్పొరేటర్లతో కలిసి బుధవారం పరిశీలించారు. నాణ్యతలో లోపాలున్నాయని, ఇంకా అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు ఆయన సూచించారు. ఎవరి ఒత్తిడి ఉన్నప్పటికీ నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని, గతంలో చేసిన పొరపాట్లు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో నడువదని, చూస్తూ ఊరుకోమని కాంట్రాక్టర్‌ను, అధికారులను సుడా చైర్మన్ హెచ్చరించారు. హంపి థీయేటర్ వెనక వారసత్వ కట్టడం మల్టీ పర్పస్ పాఠశాల దెబ్బతిని ఉందని, దాన్ని కొంత తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సుడా చైర్మన్ వెంట కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, భూమాగౌడ్, సరిల్ల ప్రసాద్ నాయకులు ఎండి తాజ్, ఆర్ష మల్లేశం, కాశెట్టి శ్రీనివాస్, మెండి చంద్రశేఖర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పెద్దిగారి తిరుపతి, కుర్ర పోచయ్య, దన్న సింగ్, జక్కుల మల్లేశం, జీడి రమేష్, మీరాజ్, బషీర్, సుదర్శన్, ఎల్లారెడ్డి సత్యనారాయణరెడ్డి, ఈఈ స్మార్ట్ సిటీ ఏఈ పాల్గొన్నారు.



మల్టీపర్పస్ పార్కులో పనులు పరిశీలిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు లలో భాగంగా గురువారం ఉదయం 8:30 నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్,టూ,రూరల్,ఏడిఈలు, పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏం లావణ్య, గాదం రఘులు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు రాంనగర్, గీతాభవన్, పీటీసీ, వాల్‌మార్ట్, రాంనగర్, ఫిష్ మార్కెట్ ఏరియా, సంతోష్‌నగర్, సిద్ధార్థ స్కూల్ ఏరియా, వాసర హాస్పిటల్ ఏరియా, మానేర్ స్కూల్ బ్యాక్ సైడ్ ఏరియా, మంకమ్మతోట, సత్య లాడ్జ్‌ఏరియా, రాజీవ్ పార్క్, జయరాం హాస్పిటల్ ఏరియా, లేబర్ అడ్డా రోడ్, పద్మనగర్ ఏరియా, బుల్ స్టేషన్ ఏరియా , డెయిరీ ఫామ్ ప్రాంతం, డెయిరీ బ్యాక్ సైడ్ ఏరియా, శ్రీహరినగర్, పిటిసి ప్రాంతం, కూర్మ వాడ, రాంనగర్ ఏరియా, వాల్‌మార్ట్‌ప్రాంతాలు.

● బావుపేట్, ఆసిఫ్‌నగర్‌లో ఉదయం 8:30నుంచి 11గంటల వరకు. ఆసిఫ్‌నగర్, బావుపేట్ ఫీడర్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదు. ప్రభావిత ప్రాంతాలు.. ఖాజీపూర్, ఆసిఫ్‌నగర్, బావుపేట, చింతకుంట, ఎలగందల్.

● టవర్‌సర్కిల్, టౌన్-5 విభాగంలో గంజ్ ఫీడర్ నిర్వహణ కారణంగా ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ప్రభావిత ప్రాంతాలు.. గంజ్, బోయివాడ, మార్కెట్ ఏరియా, అన్నపూర్ణ కాంప్లెక్స్ సిఖ్‌వాడి, లక్ష్మీనగర్, రాఘవేంద్రనగర్, కమాన్ ప్రాంతం వరకు.

● మధ్యాహ్నం 1గంటల నుంచి 2గంటల వరకు విద్యానగర్, విజయ్ దుర్గా కాలనీ, హరిహరనగర్, వెంకటేశ్వరకాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

యాదవులకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

సుభాష్‌నగర్, జనవరి 8(జనవరి): రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో యాదవులకు జనాభా పరంగా 15 రిజర్వేషన్ కల్పించాలని జిల్లా యాదవ సొసైటీ కార్యదర్శి సందబోయిన ప్రసాద్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. గొల్లకురుమల అభివృద్ధి కోసం జిల్లా సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు పుట్టపాక శ్రీనివాస్, కార్పొరేటర్ జంగిలి ఐలేందర్, ఆవుల మల్లేశం, బండ వేణు, జంగా కొమురయ్య, కుమార్, ముక్కెర ప్రణయ్, అట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా నాటక సమాజాల కమిటీ ఆవిర్భావం



జిల్లా నాటక సమాజాల కమిటీ సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళాభారతిలో బుధవారం రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా నాటక సమాజాల కమిటీ ఆవిర్భావం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, పరిశీలకుడు, రాష్ట్ర ఈసీ మెంబర్ గూడూరు బాలాజీ, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరాజు రవీందర్‌రావు, రాజేంద్రప్రసాద్, నాగరాజు పర్యవేక్షణలో కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రొడ్డ యాదగిరి, మాడిశెట్టి గోపాల్, కోశాధికారిగా తిప్పర్తి ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారుగా పెద్దపల్లి రాజేంద్రప్ర సాద్, గౌరవాధ్యక్షునిగా జి కృపాదానం, ఉపాధ్యక్షులుగా కుడికాల ప్రభాకర్, వడ్నాల మాధవి, మంచాల రమేశ్, సింహాచలం యతీందర్, కోటగిరి దేవయ్య ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా కెఎస్ అనంతాచార్య, ప్రచార కార్యదర్శిగా గద్దె ఉదయ్‌కుమార్, సభ్యులుగా మున్ననూరి రాజేశ్వర్‌రావు, పబ్బా రాజమౌళి, ఆగస్టీన్, కొత్తకొండ సత్యనా రాయణ, బి అజయ్ కుమార్, కూనమల్ల రమేశ్, ఏకెరెడ్డి , ఏ బాలకృష్ణమాచారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ కరీంనగర్‌లో నాటకరంగ వికాసం కోసం కార్యవర్గ సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.

బీజేపీలో సంస్థాగత సందడి

(5వ పేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు బీజేపీ ప్రణాళికలు రూపొందిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం జరిగినందున బూత్‌స్థాయిలో ఉన్న నేతలు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకుని వారి అభీష్టం మేరకు పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేయాలని భావిస్తోంది.

మోడ్రన్ కాలనీగా హౌసింగ్‌బోర్డు

● మేయర్ వై సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థలో హౌసింగ్‌బోర్డు ఒక మోడ్రన్ కాలనీగా తీర్చిదిద్దుతున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని 7వ డివిజన్ హౌసింగ్‌బోర్డు మినీ స్టేడియం మైదానంలో కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్‌తో కలిసి 7 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి మేయర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గతంలో హౌజింగ్‌బోర్డుకు రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో ప్యాకేజీ-3 కింద హౌసింగ్‌బోర్డు కాలనీలన్నిటినీ తీసుకొని చక్కటి స్మార్ట్ రోడ్లను నిర్మాణం చేశామన్నారు.

రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందిచిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను బుధవారం కరీంనగర్ డీఎఫ్‌వో బాలమణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి మహేందర్ రాజు, ముఖ్య సలహాదారులు కృష్ణారెడ్డి బుచ్చిరెడ్డి, చక్రపాణి సారయ్య, రాజగోపాల్ రెడ్డి, మధుసూదన్ రావు, సాంబమూర్తి, రామస్వామి, జగన్మోహన్, ప్రతాపరెడ్డి, ఖాదర్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి వెంకన్న ఆలయంలో ఏర్పాట్లు

కరీంనగర్ కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరంలోని ప్రాచీన మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ కందుల సుధాకర్, వ్యవస్థాపక వంశీయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

● నగరంలోని జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి దేవాలయాల సముదాయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా 5-30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్, ఈఓ కొస్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్షపై అవగాహన

భగత్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష ఐదవ తరగతిలో ప్రవేశానికి కొత్తపల్లి మండలంలోని చింతకుంట గురుకుల పాఠశాల బోధన సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. చింతకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, విద్యార్థులు, తల్లితండ్రులకు అవగాహన, పరీక్ష దరఖాస్తు, హెల్ప్ డెస్క్ వివరాలను వివరించారు.

ఫుడ్ పాయిజన్‌పై విచారణ చేసి చర్యలు చేపట్టాలి

భగత్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని శర్మనగర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్ పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌కు విరాళం

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల 1981కు బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి కెనడాలో ఉంటున్న దేవళ్ల శ్రీధర్ పాఠశాలకు 1,00,116 రూపాయల విరాళం అందించారు. పాఠశాల అభివృద్ధి కోసం విరాళం అందించిన శ్రీధర్‌ను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్‌రావు, కార్యదర్శి, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ అభినందించారు.

బంధువుల నుంచి చట్టబద్ధమైన దత్తత

కరీంనగర్ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జమ్మికుంట, హుజూరాబాద్‌కు చెందిన పిల్లలులేని దంపతులు వారి బంధువులు, రక్తసంబంధీకుల నుంచి చట్ట బద్ధమైన దద్తత తీసుకున్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దత్తత ఉత్తర్వుల ను దత్తత తల్లిదండ్రులకు అందజేశారు.

వివేకానంద కళాశాలలో వ్యాస రచన పోటీలు

గణేశ్‌నగర్,జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న నిర్వహించే స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని 'వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శం' అనే అంశంపై వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్ తెలిపారు.

ఆగని అక్రమ లేఅవుట్లు

● ఆరు ఎకరాల్లో హద్దురాళ్లు తొలగించిన అధికారులు ● కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ

కరీంనగర్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. నగునూర్‌లో విచ్చలవిడిగా పొలాల్లో గుంటల కొద్దీ హద్దులు పెట్టి విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సుడా అనుమతులు లేకుండానే ఎకరాల కొద్దీ అక్రమ లేఅవుట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం ఒకరు వీటిపై ఫిర్యాదు చేయగా హద్దులు తొలగించారు. బుధవారం నగునూర్ గ్రామశివారులోని శ్రీదుర్గదేవి ఆలయం దగ్గరలో ఉన్న 834, 835, 836, 852, 853 సర్వేనెంబర్లలోని ఆరు ఎకరాల్లో చుట్టూ ప్రహరీ నిర్మించి అనుమతులు లేకుండా లేఅవుట్ చేశారు. దీనిని గుర్తించిన గ్రామానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఫిర్యా దు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి అక్రమ లేఅవుట్ స్థలాలను పరిశీలించారు. ఆరు ఎకరాల్లో ఏర్పాటు చేసి హద్దురాళ్లను గ్రామపంచాయతీ సిబ్బందితో తొలగించారు. ప్రభుత్వ అనుమతి లేని వెంచర్‌లో స్థలాలు కొనుగోలు చేసిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ లేవుట్ స్థలాల క్రయవిక్రయాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



నగునూర్‌లో అధికారుల సమక్షంలో హద్దురాళ్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం కృషి



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ఆర్థిక అభివృద్ధి సాధించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధరలో మహిళా శక్తి క్యాంటీన్, కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి కోసం మహిళా సంఘాలకు విద్యార్థులకు అందించే యూనిఫాం తయారీని ప్రభుత్వం అప్పగించిందన్నారు. గంగాధర మండలంలో నాలుగు ఎకరాల్లో సోలార్ ప్యానల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల 36 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. గంగాధర రైతులు ఎల్లమ్మ చెరువుతో పాటు నారాయణపూర్ రిజర్వాయర్‌ను నింపాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సత్యం నీటిపారు దల శాఖ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడి పంటలు ఎండిపోకుండా నీటి విడుదల చేయాలని మాట్లాడగా నాలుగు రోజుల్లో విడుదల చేస్తామని అధికారి తెలి పారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత‌శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి, ఏపీఎం పవన్‌కుమార్, మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం

సైదాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులను ఆరు వేల నుంచి 10 వేలకు పెంచడంపై బీజేపీ నాయకులు మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతీ గ్రామానికి నాలుగు లక్షల నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నెల్లి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు బాసవేణి సంపత్, నాయకులు సీర్ల సతీష్, కిరణ్, శ్రీకాంత్, నాగరాజు, శ్రీనివాస్, రాజు, భిక్షపతి పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి 91 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటొరెడ్డి, నాయకులు సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కరీంనగర్ స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఖో- ఖో పోటీల్లో పాల్గొనే కరీంనగర్ ఉమ్మడి జిల్లా మహిళల జట్టుకు బుధవారం కోరుట్ల కేరళ స్కూల్ కరస్పాండెంట్ బారీ, గంగాధర్, జ్యోతిబాపూలే పాఠశాల ఆర్‌సీవో అంజలి తిమ్మాపూర్ శిక్షణ శిబిరంలో క్రీడా దుస్తులు అందించారు.

అంతరాలు లేని సమాజమే కమ్యూనిస్టు పార్టీల లక్ష్యం

చిగురుమామిడి,జనవరి 8(ఆంధ్రజ్యోతి): దోపిడీకి వ్యతిరేకంగా అంతరాలు లేని సమసమాజమే కమ్యూనిస్టు పార్టీల లక్ష్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శులు, మండల స్థాయి ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కల్గిన సీపీఐని బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సీపీఐ పార్టీ పేదప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. దేశ వ్యాప్తంగా అనేక రంగాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా దేశ ప్రధాని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ యేడాది కాలం అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. సమగ్ర భూ సర్వేలు పూర్తి చేసి భూభారతిని దుర్వినియోగం చేయవద్దని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండ రైతులందరికీ రుణాలు ఇవ్వాలని అన్నారు. మండలంలో పార్టీకి పూర్వ వైభవం తీసుక రావాలన్నారు. ఎలగందుల రాజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు గూడెం లక్ష్మి, అందె స్వామి, చిన్న స్వామి, బూడిద సదాశివ, ము ద్రకోల రాజయ్య, మాజీ సర్పంచ్‌లు కోమటి రెడ్డి జయపాల్‌రెడ్డి, గోళి బాపురెడ్డి, అన్ని గ్రామాల కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

● రేకొండ గ్రామానికి చెందిన గండ్రతి బీమయ్య ప్రమాదవశాత్తూ మృతి చెందగా ఆయన కుటుంబాన్ని చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

సోలార్ పవర్ యూనిట్‌కు స్థల పరిశీలన

సైదాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్ యూనిట్ ఏర్పాటుకు మండలంలోని వెన్నంపల్లి శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 427లోని గుట్టను డీఆర్డీవో శ్రీధర్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, ఏపీఎం కుమారస్వామి, ఏపీవో రాణి, ఆర్‌ఐ ప్రదీప్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

హుజూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో ట్రాలీ వాహనదారులకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఎంవీఐ కంచి వేణు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. ప్రతి వాహనదారుడు ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు శ్రీకాంత్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వీణవంక జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త గణపతి తండ్రి సిలివేరు భీమయ్య ఇటీవల మృతి చెందాడు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గణపతిని బుధవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రామిడి ఆదిరెడ్డి, చెన్నమాధవుని నర్సింహరాజు, బత్తిని నరేష్‌గౌడ్, సంపత్ రావు, కొండల్‌రెడ్డి, రాజేందర్, మల్లేష్ ఉన్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై కలెక్టరుకు ఫిర్యాదు

చిగురుమామిడి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఇన్స్పెక్టర్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని మూదిమాణిక్యం గ్రామానికి చెందిన జక్కుల రాములు అనే రైతు బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ఆర్‌ఐ గతంలో భూమి పాస్‌బుక్‌ల విషయంలో అనేక ఇబ్బందులు పెట్టాడని అన్నారు. వ్యవసాయ బోరుకు విద్యుత్ మంజూరు కోసం ఆర్‌ఐ దగ్గరికి వెళ్తే దురుసుగా ప్రవర్తించాడన్నారు. తనకు న్యాయం చేయాలని కోరాడు. దీనిపై ఆర్‌ఐ సంతోష్‌ను వివరణ కోరగా రైతు రాములు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. కావాలనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఐ సంతోష్ ప్రవర్తనతో అనేక గ్రామాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ ఎంపిటిసి కత్తుల రమేష్‌యాదవ్ అన్నారు. కలెక్టర్ స్పందించి ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కలెక్టర్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు

బీజేపీ మాజీ ఎంపీ దిష్టిబొమ్మ దహనం

సుభాష్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వయనాడ్ ఎంపీ ప్రియాంకగాంధీ పట్ల బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరి చేసిన వాఖ్యలపై నగరంలో బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం వాసు ఆధ్వర్యంలో రమేశ్ బిదురి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపెల్లి శ్రీకాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: వయనాడ్ ఎంపీ ప్రియాంకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదూరి, ప్రధాని మోదీ దిష్టిబొమ్మను బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలు, దళితుల పట్ల అనేక దాడులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పి అరవింద్, పి నాగరాజు, జి ప్రశాంత్, విష్ణువర్ధన్, నవీన్, తరుణ్‌కుమార్, సురేందర్, రేవంత్, అజయ్, వంశీ, అజిత్, సంపత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: అలుగునూర్ కూడలి వద్ద యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ మాజీ ఎంపీ రమేష్ భూదురి దిష్టి బొమ్మను దమనం చేశారు. ఎంపీ ప్రింయాకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. రమేష్ బిదూరిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు అట్ల అనిల్, ఉపాధ్యక్షుడు ఎల్కపల్లి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

హుజూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను తహసీల్దార్ కనకయ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాప్రా జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్పీఎస్ విధానాన్ని, రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో శనిగరం నరేందర్, కట్ట నాగభూషణచారి, బొంగోని వెంకటయ్య, మునీరుద్దీన్, రామకృష్ణయ్య, సమ్మయ్య, వీరస్వామి, మల్లారెడ్డి, జమదగ్ని, సాంబయ్య, కనకయ్య, శ్రీహరి, రామకృష్ణ, రవీందర్, మొగిలయ్య పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

గన్నేరువరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి న్యాలపట్ల వీరమల్లు, న్యాలపట్ల స్వరూపకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నాగపురి శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ న్యాలపట్ల కనకయ్య, మాజీ సర్పంచ్ సుదగోని మల్లేశం పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

చొప్పదండి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు బ్యాంకు అకౌంట్లను తెరిపించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ బెనర్జీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ దీక్షిత్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రాజమౌళి పాల్గొన్నారు.

'బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి'

చొప్పదండి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైన్స్ యజమానులు సిండికేట్‌గా మారారని ఆరోపించారు.